# ఆరాధన

## (Worship)

**పాఠ్యోద్దేశం** : ఆత్మీయ పెరుగుదల విషయంలో ఆరాధనా విలువను చూపించుట.

## ఉపోద్ఘాతం

*దేవా, నా దేవుడవు నీవే, వేకువనే నిన్ను వెదకుదును నీ బలమును నీ ప్రభావమును చూడవలెనని పరిశుద్ధాలయమందు నేనెంతో ఆశతో నీతట్టు కనిపెట్టియున్నాను. నీళ్ళు లేకయెండియున్న దేశమందు నా ప్రాణము నీ కొరకు తృష్ణగొనియున్నది నీమీద ఆశచేత నిన్ను చూడవలెనని నా శరీరము కృశించుచున్నది.* *కీర్తనలు 63:1, 2*

రాజైన దావీదు ఆరాధనలో దేవుని శక్తిని, మహిమను చూసాడు. "నీ దేవుడైన యెహోవాకు భయపడి ఆయనను సేవించి ఆయన పేరట ప్రమాణము చేయవలెనని" మోషే చెప్పినాడు (ద్వితీ. 6:13). నలుబది దినములు ఉపవాసం చేసిన పిమ్మట యేసు తన యొద్ద నుండి సాతానును పంపివేసినప్పుడు మోషే చెప్పిన ఈ మాటనే ఎత్తిచెప్పారు. యేసు వానితో "సాతానా, పొమ్ము ప్రభువైన నీ దేవునికి మ్రొక్కిఆయనను మాత్రము సేవింపవలెను" మత్తయి 4:10. మనలను సృష్టించిన **ఏకైక దేవు**నిని క్రైస్తవులమైన మనం **ఆరాధిస్తాము** (అపొ. కార్య. 14:15). క్రైస్తవులు దేవునిని ఆరాధిస్తారు. అందుకు ఒక కారణం దేవుడు దానిని ఆజ్ఞాపించటమే. అయితే, మన సొంత ఆత్మీయ పెరుగుదల విషయంలో ఆరాధనలో ఎంతో విలువ వుందని మనము నమ్మాలి.

క్రైస్తవులుగా మనం దేవునికి అర్పించు ఆరాధన ద్వారా పొందే విలువను ఈ పాఠంలో మనం ఆలోచన చేద్దాము. ఆరాధనలో మనము చేయవలసిన కార్యములను గూర్చి చదువుకుందాం. అయితే, మనం దేవునిని ఎట్లు ఆరాధించాలని ఆయన కోరుకుంటున్నాడో దానిని మనం ఇంతకు మునుపే ఎరిగియున్నామని భావించుదాము. "క్రీస్తునందున్న" క్రైస్తవుల మానసిక వాతావరణం మీద ఆరాధనా ప్రభావం ఎలా వుంటుందో ఆలోచిస్తూ ఈ పాఠాన్ని చదువుకుందాం. ఆత్మతోను, సత్యముతోను మనము దేవుని ఆరాధించునప్పుడు ఆయన మన ఆరాధనలో సంతోషిస్తాడని మనము నమ్ముతున్నాము. అయినప్పటికీ, మన సొంత జీవితాలలో ఆరాధనా ఫలితం ఎంతగా ఉంటుందో ఈ పాఠం నొక్కి చెప్తుతుంది (యోహాను 4:23).

## పాఠము

ఆరాధన అని తర్జుమా చేయబడిన గ్రీకు పదాలు క్రొత్త నిబంధనలో చాలా ఉన్నాయని డబ్ల్యు. ఇ. వైన్‌గారి గ్రీకు నిఘంటువు ప్రకారం మనకు అర్థమౌతుంది. ఆరాధన అనే మాట యొక్క అర్థానికి సంబంధించి ఒక సంపూర్ణ చిత్రం మనకు దొరికేటట్టుగా ఆ మాటల్లో కొన్నింటిని పరిశీలించుదాం. ఉదాహరణకు, అరీయొప గీయులతో పౌలు చేసిన వాదనలో ఆరాధనకు సంబంధించి గ్రీకు ప్రతులలో రెండు విభిన్న మాటలు వ్రాయబడ్డాయి. "నేను సంచరించుచు మీ దేవతా ప్రతిమలను చూచుచుండగా (SEBASMA సెబాస్మా) ఒక బలిపీఠము నాకు కనబడెను. దానిమీద, తెలియబడని దేవునికి అని వ్రాయబడి యున్నది. కాబట్టి, మీరు తెలియక దేనియందు భక్తికలిగియున్నారో (EUSEBEO, యుసిబియో) దానినే నేను మీకు ప్రచురపరచు చున్నాను." అని పౌలు చెప్పాడు (అపొ. కార్య. 17:23). యుసిబియో అనే మాటకు గౌరవించుట లేక భక్తి కనుబరచుట అని అర్థం. సెబాస్మా అనే మాటకు దేవతా ప్రతిమ లేక ధ్యానం అని అర్థం. అపొస్తలుల కార్యాలు 17:25లో (THERAPEUO, థెరాపియో) అనే గ్రీకు మాట తెలుగు అనువాదంలో సేవించుట అని తర్జుమా చేయబడింది. అదే గ్రీకు మాటను జార్జిరాజు ఆంగ్లాను వాదం (king James Version) లో ఆరాధించుట అని తర్జుమా చేసారు. థెరాపియో అనే మాటకు సేవించటం, బాగుచేయటం, స్వస్థపరచటం అనే అర్థాలు ఉన్నాయి. కొలొస్స. 2:18లో (THRES KEIA, థ్రెస్కియా) అనే గ్రీకుమాట ఆరాధన అనే తర్జుమా చేయబడింది. మత సంబంధమైన పూజ అని దాని భావం. అపొస్తలుల కార్యాలు 7:42లో (LATR EUO, లేట్రియో) అనే గ్రీకుపదం తెలుగు బైబిలులో సేవించుట అని తర్జుమా చేయబడింది. కొన్ని తర్జుమాలలో అదే మాట ఆరాధన అని కూడా తర్జుమా చేయబడింది.

ఆరాధన అని తర్జుమా చేయబడి, క్రొత్త నిబంధనలో తరుచుగా వాడబడిన గ్రీకు మాట (PROSKUN, ప్రోస్‌కున్) సాగిలపడి ముద్దు పెట్టుకొనుట అని దాని భావం. మత్తయి 4:9,10 మరియు యోహాను 4:20-24లో ఇదే మాట వాడబడింది. మత్తయి 15:9లో వాడబడినట్లుగా (SEBOMAI సెబోమై) అనేది సామాన్యంగా వాడ బడిన మరో గ్రీకు పదం. మ్రొక్కుట పూజనీయు డని గౌరవించుట అంటే భయభక్తులు కనబరచుట అని దాని భావం. దేవుణ్ణి ఆరాధించునప్పుడు మనం ఏం చేస్తాము? పైన వివరింపబడ్డ నిర్వచనాలు ఆరాధనకు సంబంధించిన ఒక సంపూర్ణ అవగాహనను మనకిచ్చాయి. దీనిని బట్టి విశ్వాసియైన క్రైస్తవుడు దేవునిని ఆరాధించునప్పుడు ఏం జరుగుతుందో ఈ విధంగా చెప్పవచ్చు. దేవుణ్ణి మనం ముద్దు పెట్టు కోవాలనే అను భూతిని పొంది దేవుడు పరిశుద్ధుడనే ఆలోచనతో భక్తి పూర్వకంగా ఆయనను గౌరవించి మత సంబంధమైన కార్యములతో ఆయనకు సేవచేస్తాము. ఆరాధన అనే మాటకు చెప్పబడిన ఇట్టి నిర్వచనాన్ని కలిగినవారమై దేవుడు ఆజ్ఞాపించిన ఆరాధన "క్రీస్తు నందు" మన జీవితాలను ఎంతగా ప్రభావితం చేస్తుందో అర్థం చేసుకోవటం ఈ పాఠంలో మన ఉద్దేశం.

ప్రభురాత్రి భోజనం క్రైస్తవ ఆరాధన. ప్రభురాత్రి భోజనంలో క్రీస్తు సిలువ మరణాన్ని జ్ఞాపకం చేసుకుంటూ ఆయనతో సహవాసం చేస్తాము. మన పాపాల కోసం యేసు బలిగా అర్పింపబడినారని మనం విశ్వసిస్తున్నట్లు ఈ ఆరాధన ద్వారా లోకానికి చూపిస్తున్నాము (1 కొరింథీ

11:17-26). ఆరాధన అనే మాటకు మనంచెప్పు కొనిన నిర్వచనం ప్రకారం మత సంబంధమైన ఈ కార్యక్రమం పాటిస్తూ ప్రతి ప్రభువు దినము నందు దేవునిని మనం సేవిస్తాము (అపొ. కార్య. 20:7). మన కోసం క్రీస్తు అనుభవించిన శ్రమనంతటినీ మనం భక్తి పూర్వకంగా జ్ఞాపకం చేసుకొని ఆయనను ముద్దు పెట్టుకోవాలని కోరుకుంటాము. విశ్వాసులైన క్రైస్తవులు వారానికి ఒక మారు యేసు పక్షాన నిలుస్తారు.

ఒక కారణం నిమిత్తం ప్రజలు బహిరంగంగా నిలవబడినప్పుడు వారి విలువల జాబితాలో ఆ కారణం చేరి పోతుంది. ఒక సమూహంతో కలిసి మనం అదే కారణం నిమిత్తం నిలవబడినప్పుడు మరింత అధికశక్తితో నిలువగలుగుతాము. ప్రభురాత్రి భోజనంలో పాలుపొందుట ద్వారా క్రైస్తవులు సంఘమంతటితోపాటు క్రీస్తు కోసం నిలబడతారు. యేసుతో సహవాసం అనుభవిస్తారు. దేవత్వంతో పాటుగా ఏదైనాఒక ముఖ్య కార్యంలో పాలుపొందే అవకాశం మనకు ఎప్పుడు లభించినా ఆ దైవికవ్యక్తితో మన గుర్తింపు బలపడుతుంది. ఈ అనుభవంలో మన ఉద్వేగాలు రేపబడితేనే అది సాధ్యమౌతుంది.

ఆరాధన అనే మాట యొక్క సంపూర్ణ నిర్వచనంలో మనం చూసిన అన్ని భావాలు ప్రభురాత్రి భోజనంలో నిబిడీకృతమై ఉన్నాయి. క్రైస్తవుని ఆత్మీయ జీవితంలో ప్రభురాత్రి భోజనం ప్రముఖ పాత్ర వహిస్తుంది. ఏడు రోజులకు ఒక మారు సంభవించే ఈ కార్యక్రమం మనకు ఉద్వేగపూరితమైన అనుభవం. ఈ విధమైన ఆరాధన బలమైన శీలాన్ని ఆదేశించటం మాత్రమే కాక శీలాన్ని కూడా బలపరుస్తుంది. తత్ఫలితంగా, ఆరాధకుని శీలం బలపరచబడుతుంది ఈ ఆరాధ నాంశం విలువ ఇదే. బహుశా దేవుడు సంతోషిస్తాడు అంతేకాదు, మరికొన్ని మంచి సంగతులు మనమేలు కోసం పని చేస్తాయి. ప్రభువు కోసం బహిరంగా నిలవబడినప్పుడు సువార్త ప్రకటనకు సంబంధించిన విలువ కూడా ఉంటుంది. ఎందుకంటే, మనం చేస్తున్న ఆరాధనను చూచిన పాపులు దీని ద్వారా ఒక సందేశాన్ని తెలుసుకోగలుగుతారు.

ప్రభురాత్రి భోజనమును ప్రతి ఆదివారమున తీసుకోవాలని మొదటి శతాబ్దంలో ప్రభువు సంఘానికి ఆజ్ఞాపించనిప్పటికిని, అది ఆచారపరమైనది కాదు. ఈ రోజు, ప్రభురాత్రి భోజనమును వారు కోరుకొనినట్లుగా తీసుకొనుట ద్వారా ఆచారకరమైన అవకాశాన్ని తొలగించుటకు కొంతమంది మత బృందాలు నిర్ణయించుకున్నారు. మనం ఆలోచించవలసిన అవసరత ఉన్నది, ఎందుకంటే క్రైస్తవ అభ్యాసము అనునది ఒక ఆచారముగా మారినప్పుడు దానిని అభ్యాసం చేసే వానికి ప్రయోజనముండదు. అపొస్తలుడైన పౌలు ఒక కారణాన్ని చెప్పాడు; అట్టివి (ఆచారములు) ...శరీరేచ్ఛానిగ్రహ విషయములో ఏ మాత్రమును ఎన్నిక చేయదగినవి కావు (కొలొస్స. 2:23). క్రైస్తవులు అభ్యాసము చేయునట్లు ప్రభువు అడిగే సంగతులేమిటంటే, మన ఆత్మీయ ఎదుగుదల నిమిత్తమును అలాగే దేవుని వాంఛలను తీర్చడమైయున్నది.

ఆచారమును తొలగించడానికి, క్రైస్తవ్యం యొక్క మూడు మూలకములన్నియు ఒక క్రైస్తవుని ప్రతి అభ్యాసములో సరిగా చేర్చబడాలి, అది ఆరాధనయైనా, సువార్త కరణయైనా లేదా క్రొత్త జన్మ ప్రక్రియయైనా సరే. మూడు మూలకములు: మనం నమ్మునది (వేదాంతము), మనం ప్రవర్తించు విధానం (నైతికత) మరియు మనం చేయునది (అభ్యాసం), ఈ సంగతిని గూర్చి మనకు 1 కొరింథీ. 11:17-34లో ఉదాహరణ ఉంది. కొరింథీ సంఘములోని కొంత మంది సభ్యులు సరియైన అభ్యాసమును సరియైన సమయానికి చేస్తున్నారు. వారు ప్రభురాత్రి భోజనమును వారంలో మొదటి రోజున తీసుకొంటున్నారు. ఈ అభ్యాసం చేయు సమయంలో మనస్సునందు సరియైన వేదాంతపరమైన సిద్ధాంతమును వారు కలిగియుండాలని పౌలు వారికి గుర్తు చేసాడు. వారు యేసు మరణాన్ని జ్ఞాపకం చేసుకొంటూ ఉండియుండవచ్చు, కాని వారిఆరాధనకు ఏ విధమైన ప్రయోజనం లేదు ఎందుకంటే వారు అనైతిక పద్ధతిలో అభ్యాసము చేస్తున్నారు. అతడు అన్నాడు, "ఇందువలననే మీలో అనేకులు బలహీనులును రోగులునై యున్నారు" (1 కొరింథీ. 11:30).

ఆరాధన అనే మాట విభిన్నమైన పెక్కు గ్రీకు మాటల నుండి ఎట్లు తర్జుమా చేయబడిందో అలాగే "ప్రార్థన" అనే తెలుగు మాట కూడా క్రొత్త నిబంధనలో వేరువేరు గ్రీకు పదాలు పెక్కింటి నుండి తర్జుమా చేయబడింది. ఆ మాటలన్నింటనీ ఆలోచించి ప్రార్థన అనే మాట యొక్క సంపూర్ణ నిర్వచనాన్ని ఈ విధంగా చెప్పవచ్చు. మన కోరి కలను దేవునికి విన్నవించుకొంటాము. మన శ్రమలయందు ఆయన జోక్యం చేసు కోవాలని అడుగుతాము ఆయన ముందు మన జీవితాలను కుమ్మరించు కొంటాము. ఏ సమయమందైనా, ఏ స్థలంలోనైనా క్రైస్తవులు తక్షణమే చేయగల ఆరాధనాంశం ప్రార్థన (1 థెస్స. 5:16). త్రోవ తప్పిన క్రైస్తవులు కూడా మారుమనస్సు పొంది పాప క్షమాపణ కోసం వెనువెంటనే దేవుణ్ణి వేడుకోవచ్చు (అపొ. కార్య. 8:22). ప్రార్థనద్వారా మనం దేవునికి అర్పించే ఆరాధన మూలంగా మన కంటే గొప్పదైన ఒక శక్తిని గుర్తించ గలుగుతాము.

క్రైస్తవులు మరియు ఇతరులు కూడా చేసే ఒక విధమైన ప్రార్థన మూడు భాగాలుగా విభజింపబడుతుంది. సహాయం కోసం దేవునికి విన్నపం చేస్తూ చేసే ప్రార్థనలో **విశ్లేషణ**, విన్నపం, మరియు **ప్రక్షేపణ** అనే మూడు భాగాలు ఉంటాయి. సర్వ శక్తిమంతుడైన దేవునికి ప్రార్థించునప్పుడు ఆయన ఎదుట మన జీవితాల్ని విశ్లేషించాలి. ఆ మీదట మన లోటులను భర్తీచేయమని ఆయనను అడగాలి. ప్రక్షేపించబడిన ఒక లక్ష్యాన్ని సాధించటానికి దేవుని సహాయం మనకు అవసరం. ఇవ్విధమైన ప్రార్థనలో మనం మన బలాన్ని, బలహీనతల్ని ఆలోచించుతాము. ప్రార్థించు వేళలో మన పరిస్థితిని మనం అంచనా వేసుకుంటాము. ప్రక్షేపించబడిన మన లక్ష్యాన్ని సాధించ టానికి దేవుని నుండి మనకు కావలసిన దానిని కూడా నిర్ణయించుకొంటాము. విజ్ఞాపనా తరహా ప్రార్థనలో మన కోసం దేవుడు చేసే దానితోపాటు మనం కూడా చేయబోయేదానికి సంబంధించిన

వివరణ ఉంటుంది. మన సొంత సామర్ధ్యాన్ని మనం విశ్లేషించుకున్న దానిని బట్టి ప్రక్షేపింపబడిన మన సాధన ఆధారపడి వుంటుంది.

దయచేసి, యోహాను 17:1-26 చదివి, ఆ మీదట ఆయా పదజాలములను ఈ క్రింది విధంగా మూడు శీర్షికల క్రింద వేరుచేద్దాము. తన యొక్క పరిస్థితిని యేసు విశ్లేషించిన భాగం దేవుని జోక్యం కోసం ఆయన దేవుణ్ణి అడిగిన భాగం. మొదటిరెండు భాగాల సంయుక్త ఫలితంగా ఏది సంభవించాలని ఆయన ఎదురుచూసారో దానిని ఆయన ప్రక్షేపించినభాగం. ఉదాహరణకు, మొదటి వచనంలో యేసు తన పరిస్థితిని విశ్లేషిస్తూ "తండ్రీ, నా ఘడియ వచ్చియున్నది" అని సంక్షేపించినారు. "నీ కుమారుని మహిమపరచుము" అనేది ఆయన దేవునిని అడిగిన విషయం. "కుమారుడు నిన్ను మహిమ పరచునట్లుగా" అనేది యేసు యొక్క ప్రక్షేపణ. నాఘడియ వచ్చియున్నది (మొదటిభాగం), నీ కుమారుని మహిమ పరచుము (రెండోభాగం) అనే రెండు భాగాల ఫలితమే ఆ ప్రక్షేపణ. యోహాను సువార్త 17వ అధ్యాయంలోని యేసు చేసిన ప్రార్ధన అంతటినీ ఈ మూడు శీర్షికలుగా వర్గీకరింపగలము.

ఈ విధమైన ప్రార్ధనా ఆరాధనలో ఒక ప్రయోజనం వుంది. అది ఏదంటే, మనలను మనం అంచనా వేసుకోవటానికి దాని శక్తి మనకు సహాయం చేస్తుంది. కొందరు తమ్మును తాము అంచనా వేసుకోవటం చాలా అరుదు. ఎందుకంటే, వారి అంచనాలో అగుపించింది వారికి అయిష్టం. తీర్పు దినాన దేవుడు మనలను పరిశీలించక ముందే, క్రైస్తవులమైన మనం మనలను మనమే ఇప్పుడు పరిశీలించుకొనవలసిన వారమై ఉన్నాము (2 కొరింథీ. 13:5). పాపులు తమ్మును తాము పరిశీలించుకొంటారు. అయితే, వారి అంచనాలో వారు కనుగొనిన లోపాలను వారు గానీ, వారి స్నేహితులు గానీ జయించలేరు. క్రైస్తవులమైన మనకోసం దేవుడు మన "లోటులను భర్తీచేస్తాడని" ముందే తెలుసుకున్నాము. ఏది సంభవించాలని ఆశించి దేవుని ఎదుట మనం ప్రక్షేపణ చేసినామో దాని విషయంలో దేవుని జోక్యం కోసం అడిగే హక్కు మనకుంది (1 యోహాను 5:13-15). ఇవ్విధమైన ఆరాధనలో మనకు లభించే మరో ప్రయోజనం ఏదంటే ప్రార్ధనలను ఆలకించి కార్యాలు జరిగించే దేవునియందలి విశ్వాసాన్ని అది అభివృద్ధి చేస్తుంది. దేవుని సహాయ మును పొందిన వారమై దేవుని కోసం మన కోసం లక్ష్యాలను సాధిస్తాము. అందుకే మనం ప్రార్ధనా జీవితంలో విసుగు చెందము (లూకా 18:1; 1 థెస్స. 5:17).

మన బ్రతుకులలో సంభవించువాటికి కారణం దేవుడేనని ఒక విధమైన ప్రార్ధనలో మనం ఆయనతో చెప్పుకుంటాము. దయచేసి, అపొ. కార్య. 4:24-31 చదువుము. ఈ లేఖనంలో చెప్పబడినట్లు ఆనాటి క్రైస్తవులు ఆ సమయంలో యెరూష లేమునందు సంభవించిన దానిని గూర్చిన వృత్తాంతాన్ని తమ ప్రార్ధనలో దేవునికి చెప్పినారు. మనం గమనింపవలసిన విషయం మరొకటుంది. అదేమంటే, తమ వృత్తాంతంలో దేవునిని చేర్చియే దానిని ఆయనకు చెప్పారు. ప్రతి తండ్రి తన బిడ్డల వృత్తాంతాల్లో చేర్చబడి ఆవృత్తాంతాల్ని తన బిడ్డలు తనకు చెప్పాలని కోరుకుంటాడు. మన అనుదిన జీవిత వృత్తాంతాలు మనం చెబితే దేవుడు వినటానికి ఇష్టపడతాడు అయితే, మన జీవిత వృత్తాంతంలో ఆయన కూడా ఒక భాగంగా వుండాలని కోరు కుంటున్నాడు. అంటే, భూమి మీద మనం జీవించిన కాలమంతా దేవునితోనుఅలాగే, మన యొక్క వాస్తవికతతోను ఏకీభవిస్తాము. ప్రస్తుత కాలంలో ఇప్పుడున్న దేవుని రాజ్యం మరియు మన జీవితాల్లో ఇపుడు సంభవిస్తున్న సంగతులే మన వాస్తవ ప్రపంచంలో వుంటాయి. అప్పుడే మన యొక్క మతానికీ, మన యొక్క జీవితానికి మధ్యగల దూరం తొలగింపబడుతుంది. తత్ఫలితంగా, ఆరోగ్యవంతమైన సంపూర్ణ వ్యక్తిత్వం మరియు దేవత్వంతో సన్నిహిత సంబంధం మనకు లభిస్తాయి. మనం చేసే ప్రార్ధనలన్నీ యదార్ధంగా వుండాలి అర్ధవంతంగా కూడా వుండాలి "మరియు మీరు ప్రార్ధన చేయు నప్పుడు అన్యజనులవలే వ్యర్ధమైన మాటలు వచించవద్దు విస్తరించి మాటలాడుటవలన తమమనవి వినబడునని వారు తలంచుచున్నారు. మీరు వారివలే ఉండకుడి" అని క్రీస్తు చెప్పి నారు (మత్తయి 6:7).

కానుకలు ఇచ్చుట అనేది మరో రూపమైన ఆరాధన. "పుచ్చుకొనుటకంటే ఇచ్చుట ధన్యము" అని చెప్పినవారు ప్రభువేగదా! (అపొ. కార్య. 20:35). పుచ్చుకొనుట ధన్యం కాదు అని ఆయన చెప్పలేదు. పుచ్చుకొనేటప్పుడు ముఖ్యంగా, విశ్లేషణా పూర్వకంగా మనం ప్రార్ధించిన తరువాత దేవుడిచ్చేవాటిని పుచ్చుకొనినప్పుడు మన మందరం ధన్యకరంగానే దానిని భావిస్తాము. అయినప్ప టికీ, ఇచ్చుట అనే ఆరాధన పుచ్చుకొనుట కంటే కూడా ఎక్కువ ధన్యకరమని యేసు ప్రకటించు చున్నారు. అందు వలననే దేవుడు అన్ని యుగాలలోను తన ప్రజలు తనకు అర్పించిన ఆరాధనలో ఇచ్చుటను చేర్చెనని నిశ్చయంగా చెప్పవచ్చు.

ఇచ్చుట వలన వ్యక్తిగతంగా ప్రయోజనం ఏముంటుంది? 2 కొరింథీ. 9:12-15 లో ఓ మంచి సమాధానం మనకు దొరుకుతుంది. యెరూషలేములో పేదవారైన పరిశుద్ధులకు ఆసియాలోని సంఘములు సహాయం చేసినప్పుడు దైవమానవ సంబంధానికి సంబంధించిన ఒక **త్రిభుజం** ఏర్పడిందని మనం గమనింపవచ్చు. ఇచ్చేవారు, పుచ్చుకొనేవారు మరియు దేవుడు అనే ముగ్గురి మధ్య ఉద్వేగ భరితమైన సంబంధాల వల్ల అది ఏర్పడింది. దైవిక్రియయైన ఈ ఆరాధన వల్ల పుచ్చుకొనిన వారి భౌతిక అవసరాలు తీరాయి తత్ఫలితంగా, వారు దేవునికి విస్తారంగా కృతజ్ఞతా స్తుతులు చెల్లించారు. పుచ్చుకొనినవారి ద్వారా దేవుడు మహిమ పరచబడటం మాత్రమే గాక ఇచ్చినవారిని చూడాలనే కోరిక కూడా పుచ్చుకొనిన వారికి కలిగింది. ఇచ్చుట అనే ఆరాధన అవసరాల్ని తీర్చుతుంది ఇచ్చినవారి కోసం ప్రార్ధించునట్లుగా పుచ్చుకొనిన వారిని ప్రేరేపిస్తుంది. ఆసియా మరియు పాలస్తీనాలలో మొదటి శతాబ్దపు క్రైస్తవుల్ని ఇచ్చినవారి హృదయం అనే కృప వారిని ఒకటిగా బంధించింది. ఇచ్చేవారి హృదయం "చెప్పశక్యం కాని దేవుని వరం." క్రీస్తు

శరీరాన్ని రూపొందించునట్లు యూదులను అన్యులను ఏకంగా సమకూర్చటానికి దేవుడు ఈ కృపను వినియోగించుకోగలడని నిస్సందేహంగా చెప్పవచ్చు. ఇది నిస్సందేహముగా నేడు అనేక జాతుల మధ్య పోరాటా లను ఆపింది. ఏమైనప్పటికీ, అభాగ్యులు సహాయంకోసం అర్రుల చాచటానికి ఆరం భింపకముందే మనం గమనింపవలసిన సంగతి ఒకటుంది. అదే మంటే, దిక్కు లేని వారికి సహాయం చేసిన వారు నిరుపేదలే (2 కొరింథీ. 8:1-6,14).

ఇచ్చుట అనే ఆరాధనలో క్రైస్తవునికి లభించే లాభము ఏదంటే, దొంగల పునరావాసానికి అది సహాయం చేస్తుంది. క్రైస్తవులమైన మనం అభివృద్ధి చెందినకొలదీ దేవునికి కానుకలు ఇవ్వని పక్షమందు ఆయన యొద్ద దొంగిలించినవారమౌతాము (మలాకీ 3:8). ఇచ్చుట, మాత్రమే ఈ సమస్యను తీరుస్తుంది. ప్రభుత్వము నుండిగాని, కంపెనీ నుండి గాని, లేక పొరుగు వారినుండి గాని దొంగిలించు సమస్య మనకున్న ట్లయితే, దానికి కూడా ఇది సహాయపడుతుంది. ఈ క్రింది లేఖనం నుండి ఈభావాన్ని మనం ఆలోచించవచ్చు:

*దొంగిలువాడు ఇకమీదట దొంగిలక అక్కరగలవానికి పంచిపెట్టుటకు వీలుకలుగు నిమిత్తము తన చేతులతో మంచి పనిచేయుచు కష్టపడవలెను. ఎఫెసీ. 4:27, 28.*

ఇచ్చుట అనే ఆరాధనలో ఇచ్చిన వారికి కలిగే ప్రయోజనాన్ని నిర్ణయించటానికి వారి యొక్క వైఖరే ముఖ్యవిషయంగా వుంటుంది. మనలను మనం మెచ్చు కోటానికి గానీ లేదా ఇతరులను మెప్పించటానికి గాని మనం ఇచ్చిన యెడల దేవుని నుండి దీవెన మనకు లభించదని యేసు చెప్పినారు (మత్తయి 6:1-4). ఏ కారణం నిమిత్తం మనం ఉద్వేగ భరితంగా కానుకలర్పిస్తామో దానిని సంపూర్ణంగా తెలిసి కోవాలని యేసు మనకు చెప్పుతున్నారని మనం నిర్ధారింపవలసివుంది. "బీదల పోషణ కొరకు నా ఆస్తి అంతయు ఇచ్చినను, కాల్చబడుటకు నా శరీరమును అప్పగించినను, ప్రేమ లేని వాడనైతే నాకు ప్రయోజనమేమియులేదు" అని పౌలు చెప్పాడు. (1 కొరింథీ. 13:3). ప్రేమపూరిత హృదయంతో మనము కానుకలివ్వాలి. మనలో ప్రేమ లేకపోతే ప్రయోజనం ఏముంది? కండరాలు పెంచటానికి మనుష్యులు ఏ సూత్రం అను సరిస్తారో అదే సూత్రాన్ని మన ఆత్మీయ జీవితాలలో అనుసరిస్తాము. బరువులు ఎత్త టానికి కండరాలు అవసరం. ఆలాగే కండరాల్ని పెంచటానికి బరువులు ఎత్తటం అవసరం. ప్రభువు నొద్దనుండి కృపను పొందటానికి సంఘ సభ్యులకు ఎన్నో అవకాశాలు అనుగ్రహిస్తుంది. మనలో ప్రతి ఒక్కరం వాటిని పొందియే ఉన్నాము (1 పేతురు 4:10). ఉద్వేగభరితంగా ఇచ్చుటలో పాలుపొందునట్లు అవసరాలు సంఘ సభ్యులందరికీ ముందుగానే తెలియ జేయబడాలి. సభ్యులు కానుకలివ్వటం, ఆ మీదట నాయకులు వాటిని ఎలా ఖర్చుపెట్టాలని ఆలోచించటం లాంటి కార్యక్రమం ద్వారా ప్రయోజనం ఏదీ వుండదు. నిజానికి, ఈ విధమైన కానుకలు మోషే ధర్మశాస్త్రం తో పాటే అంతరించి పోయాయి. ఇచ్చుట అనే ఆరాధనలో వ్యక్తిగతంగా మనం పాలు పొందినపుడు మెత్తని హృదయం అనే దీవెనతో దేవుడు మనలను వ్యక్తిగతంగా దీవిస్తాడు.

క్రైస్తవులకు ప్రయోజనకరమైన మరో విధమైన ఆరాధన పాటలు పాడటం. ఆత్మ సంబంధమైన పాటలు పాడుచు దేవుని ప్రజలు దేవునిని స్తుతించటం దేవునికి ఎప్పుడూ ఆనందాన్నే ఇచ్చింది. కీర్తనల గ్రంథకర్తయైన దావీదు ఈ క్రింది విధంగా వ్రాసాడు:

*అందువలన యెహోవా, అన్యజనులలో నేను నిన్ను ఘనపరచెదను. నీ నామ కీర్తన గానము చేసెదను. కీర్తనలు 18:49.*

"కీర్తనలతోను, సంగీతములతోను, ఆత్మసంబంధమైన పాటలతోను" దేవునిని ఆరాధించాలని అపొస్తలుడైన పౌలు సంఘాలకు చెప్పాడు. ఒకరికి ఒకరు బోధించు కోటానికి, హెచ్చరించుకోటా నికి వీటిని వినియోగించాలని కూడా అతడు చెప్పాడు (ఎఫెసీ. 5:19-21; కొలొస్స. 3:16). మనం అడగవలసిన ప్రశ్న ఏదంటే, "దేవునిని స్తుతించటానికి, క్రీస్తునందున్న సహోదరులను సొదరీలను హెచ్చరించటానికి సామాన్య మైన మాటలనే వినియోగిస్తే సరిపోదా?" సామాన్యమైన మాటలు వినియోగించాలని మనకు చెప్పబడింది. అయితే, పాటలు పాడాలని కూడా దేవుడు మనకు చెప్పాడు. పాటలు పాడటం ఈనాడు చాల గందరగోళంగా తయారైంది. గతంలో ఎన్నడూఇంతగా అది గందరగోళంగా లేదు. ఏదిఏమైనా, "సాధారణ ఉచ్చారణ" కంటే పాటలు పాడటం ఎన్నడూ భిన్నమైనదే.

పాటలు పాడటం అనే ప్రక్రియలో ఒక విధమైన లయబద్ధత ఉంది. దేవుడు మానవుణ్ణి రూపొందించిన విధానానికి అది సంబంధించి వున్నట్లుగానే అగుపిస్తుంది. మనలను సృష్టించిన ప్రభువుకు మనం రూపొందించబడిన విధానం తెలిసిందే. అందుకే, పాటలుపాడటం మన స్వభా వాన్ని బహిర్గతం చేసే సహజమైన పద్ధతి అని అనుకోవలసి వస్తుంది. మన హృదయాలను దేవుని సన్నిధిలో కుమ్మరించుకోటానికి అది సహకరిస్తుంది. సిలువలో మరణించటానికై సిద్ధపడు నిమిత్తం యేసు ఒలీవల కొండకు వెళ్లే ముందుగా తన శిష్యులతో కలిసి ఒక కీర్తన పాడారు (మత్తయి 26:30). దేవునికిస్తుతి చెల్లించటంలో క్రైస్తవులు తమ యొక్క స్వరాలను, హృదయాలను మనస్సులను ఏకంగా కలబోయటానికి పాటలు పాడటం అనుమతి ఇస్తుంది (1 కొరింథీ. 14:15). మనిషిలోని ఆనందాన్ని తెలిపే సహజమైన ధోరణే పాటలుపాడటం. "ఎవనికైనను సంతోషము కలిగెనా? అతడు పాటలు పాడవలెను" అని యాకోబు చెప్పాడు (యాకోబు 5:13).

పాడుట ద్వారా దేవునిని ఆరాధించటంలో ఉన్న విలువల్ని ఇక్కడ ప్రస్తావించి యుంటిమి. అయితే, సంగీత మనోవైజ్ఞానికశాస్త్ర అధ్యయనం ఇంతకంటే అధికమైన విలువల్ని బయలుపరచగల దని నిస్సందేహంగా చెప్పవచ్చు. దేవునిని స్తుతించటం మరియు ఇతరులను హెచ్చరించటం అనువాటి యొక్క విలువను మనం గుర్తించి యుంటిమి. అయితే, ప్రార్థన మరియు మాటలు

అనే వాటి ద్వారా కూడా దేవునిని స్తుతించగలం ఇతరులను హెచ్చరించగలం. అయినను, పాడుట ద్వారా వీటిని జరిగించాలని దేవుడు మనకు చెప్పటానికి కారణం వుంది. పాడుట అనేది లయ బద్ధమైన మన స్వభావంతో ఏకమైపోయి ఆరోగ్యవంతమైన మార్గంలో మన భావోద్రేకాలను సడలిస్తుంది. మనకు తన్యతల సడలింపు లేదా మానసిక ఉల్లాసం కావాలి. అయితే, అది మద్యంతో మాత్రం కాదు. పాటలుపాడటానికని మద్యం సేవించవలసిన అవసరం మనకు లేదు. కానీ, మనం ఆత్మ పూర్ణులమై ఉండాలి. పాడుట అనేది మన మనోవికారాన్ని సడలిస్తుంది అదే సమయంలో ఇతరుల అవసరాలు తీర్చగలుగుతుంది (ఎఫెసీ. 5:18,19).

మత సంబంధమైన క్రియలు చేయకుండానే దేవునికి ఆరాధన అర్పించే మరో మార్గము ఉంది. పరిశుద్ధమును, దేవునికి అనుకూలమునైన సజీవ యాగముగా మన శరీరములను దేవునికి అర్పించటం ద్వారా కూడా మనం ఆయనను ఆరాధించగలం. ఈ క్రింది లేఖనాన్ని ఆలోచించుము.

> *కాబట్టి సహోదరులారా, పరిశుద్ధమును దేవునికి అనుకూలమునైన సజీవయాగముగా మీ శరీరములను ఆయనకు సమర్పించుకొనుడని దేవుని వాత్సల్యమునుబట్టి మిమ్మును బతిమాలుకొనుచున్నాను. ఇట్టి సేవ మీకు యుక్తమైనది.* రోమా 12:1.

మన భౌతిక దేహాలు ఈ లోకంలో మన ఆత్మలు వాడుకొనే పరికరాలు మరియు ఆత్మలు ధరించిన వస్త్రాలు (రోమా 6:13). మన మనస్సుల్లోని ఆలోచనలన్నింటినీ భౌతికపరమైన చర్యలుగా తర్జుమా చేయటానికి మన దేహాలు వినియోగింపబడు తున్నాయి (యాకోబు 2:12). శరీరాల్ని సజీవయాగంగా సమర్పించి దేవునిని ఆరాధించ టానికి పూర్వమే బాహ్యపురుషుడికి -ఆంతర్య పురుషుడికి మధ్య గల తేడాను మనం గుర్తింప సమర్థులం కావలసి ఉంది. మన ప్రభువైన యేసు తన యొక్క జీవన విధానంలోనికి మన ఆలోచనలు చెరపట్టబడటానికే పనిచేస్తున్నారు. భూమి మీద కొందరు ప్రభువులు చేయునట్లుగా ఆయన మన శరీరాలను బలవంతంగా వినియోగించుకోవడానికి వెదకటంలేదు. కానీ మన ఆలోచనలు చెరపట్టాలని ఆయన కోరుకుంటు న్నారు (రోమా. 12:2; 2 కొరింథీ. 10:5). ప్రభువును మన ఆలోచనలను చెరపట్టనిస్తే యుక్తమైన "సేవ అనే ఆరాధన"ను దేవునికి అర్పింప సమర్థులమౌతాము. దేవునిపని లోను, సువార్త ప్రకటనలోను, వాక్యోపదేశంలోను, దేవుని కోసం మన శరీరాల్ని విని యోగించటం ద్వారా మాత్రమే అది సాధ్యమౌతుంది.

మన శరీరాలను మనం స్వాధీనమందుంచుకోగలగటం ఈ విధమైన ఆరాధనలో మనం చూడగలిగే ఒక ప్రయోజనం. "మనస్సుపై శరీరం లేదా శరీరంపై మనస్సు" అనే ప్రాచీన సూక్తిని మనం కూడా వినే ఉండవచ్చు. దురాశకు లోనైపోయే మన స్వభావాన్ని అదుపులో ఉంచుకోవాలంటే మన శరీరాల్ని మన మనస్సులు స్వాధీనంలో ఉంచుకోవటం చాలా అవసరం. (రోమా 13:14) సజీవయాగముగా మన శరీరాల్ని సమర్పించటానికి మనం ఇష్టపడితే, దేహం అనేది కాలం, విశ్వం అనే వాటి కోసం వినియోగించే పరికరం మాత్రమేనని మనకు అర్థమయిందన్న మాట! యుక్తమైన సేవ అనే ఆరాధన వల్ల వుండిన మరో విలువ ఏదంటే, భూమిమీద దేవుడు జరిగించాలని కోరుకొనిన పనులు మన ద్వారా సాధించబడతాయి. క్రైస్తవ సేవ ద్వారా దేవుని లక్ష్యాలను మనం సాధించగలుగుతాము. దేవునితో సహకరించాలనే మనస్సు మనకు ఉండాలి. బలవర్ధక ప్రవర్తనను కనుపరచటానికి ఇవ్విధమైన ఆరాధన మనకు సహాయం చేస్తుంది. అప్పుడు మనం దేవునికి, ఇతరులకు మరియు మనకు కూడా ప్రయోజనకరంగా వుంటాము.

ఆరాధన మన జీవితాల్ని ఆత్మీయ పరిధికి అనుకూలంగా మలిచి, భౌతిక వాతా వరణం నుండి మనల్ని దూరం చేస్తుంది. అది మన విశ్వాసాన్ని, ఆలాగే, ఇతరుల విశ్వాసాన్ని కూడా బలపరుస్తుంది. యేసుతోను, ఆయన యొక్క సంఘం తోను లోకం ముందు మనం బహిరంగంగా నిలవటం మాత్రమే కాక, ఆవైఖరిని మన స్వభావంలో ఒక భాగం చేసుకోగలుగుతాము. పాటలలోను, ప్రార్థనలోను మన జీవితాల్ని దేవుని ఎదుట విశ్లేషించుకొని మన యొక్క ఉద్దేశాలను నిరూపించుకోగలుగు తాము. జీవితం మన ఆధీనంలోకి వస్తుంది కాబట్టి, మానవులకు మనం చేసే సేవ దేవునికి మనం చేసే ఆరాధన అవుతుంది. ఆరాధనలో మనం దేవుణ్ణి సర్వశక్తి మంతునిగా గుర్తిస్తాము. (2 కొరింథీ. 2:14-16) దేవుని చిత్తానికి అనుగుణమైన భక్తినిచూపించుట ద్వారా మన తండ్రిని మనం "ముద్దు పెట్టుకుంటాము."

## చర్చ కోసం ప్రశ్నలు

1. తనను ఆరాధించమని దేవుడు క్రైస్తవులకు ఎందుకాజ్ఞాపించాడు?
2. క్రొత్త నిబంధనలో సామాన్యంగా ఆరాధన అని తర్జుమా చేయబడిన వివిధ గ్రీకు మాటలు, వాటి అర్థాలు వరుసగా వ్రాయండి?
3. సిలువ నిమిత్తమై ప్రతివారం బహిరంగంగా నిలబడటం వల్ల వచ్చే ప్రయోజనం ఏమిటి?
4. ఆరాధన అని తర్జుమా చేయబడిన గ్రీకు మాటలు అన్నింటి యొక్క అర్థాలను ప్రభురాత్రి భోజనం ఎలా తెలియ జేస్తుంది?
5. క్రైస్తవ అభ్యాసములో ఆచారము యొక్క విలువ ఏమిటి? కొలొస్స 2:23 ప్రకారం?
6. క్రైస్తవ్యములో ఉన్న మూడు మూలకాలు ఏమిటి?
7. ప్రభురాత్రి భోజనమునకు సంబంధించి కొరింథీ సంఘం చేత ఉల్లంఘించబడిన మూలకము ఏమిటి?
8. ఇతరమైన ఆరాధన పద్ధతులకు సంబంధించి ప్రార్థన ప్రవేశం ఎట్లు భిన్నమైనది?
9. యోహాను 17లోని యేసు ప్రార్థన విభజింపబడగలుగు మూడు శీర్షికలను వ్రాయుము.
10. దేవునిని కలుపుకొని మన జీవిత వృత్తాంతాన్ని దేవునికే చెప్పుకోవటం వల్ల ప్రయోజనం ఏమిటి?
11. 2 కొరింథీ. 9:12-15 లో ఇచ్చుట అనే ఆరాధన ద్వారా ఏర్పడిన సంబంధాల త్రిభుజాన్ని వివరించండి?

12. దొంగల కోసం యేసు సూచించిన వైద్యం ఏది?
13. కేవలం మాట్లాడటం ద్వారానే కాక, పాటలు పాడాలని దేవుడు క్రైస్తవులకు ఎందుకు చెప్పాడో వివరించుము.
14. సజీవయాగముగా మన శరీరాల్ని సమర్పించటం అనే ఆరాధన వల్ల ప్రయోజనం ఏమిటి?
15. క్రైస్తవుడు దేవునికి ఆరాధన చేయటం వల్ల కలిగే విలువ అంతటినీ క్లుప్తీకరించుము.